# స్పందన

ఎర్రని ఆపిల్‌పళ్ళు తిన్న ఫలితం కాదు.... ఏకంగా రక్తాన్నే తాగినట్లుంది కనకారావు మొహం.

"చూశావా ఇది ఏం చేసిందో?" భార్య వంక ఉరిమిచూస్తూ అన్నాడు.

భర్త ఉగ్రరూపం కొత్తకాకపోయినా, భాష కొత్తగా వినిపించింది శ్రీలక్ష్మికి.

ఆ 'ఇది' కూతురని అర్థమైనా.... ఆ భాషకు కారణ మేమిటో, వెంటనే అర్థం కాలేదు ఆమెకు.

వారం రోజులుగా బిజినెస్ పనిమీద బొంబాయి, ఢిల్లీ వెళ్ళిన కనకారావు పొద్దున్నే హైదరాబాదుకు తిరిగి వచ్చాడు.

ముకుందరావు ఫోన్‌లో మాట్లాడినప్పట్నుంచి కనకారావు మొహంలో రంగులు మారాయి.

"నీ ముద్దుల కూతురు ఆ మురికి వాడలో ఏం చేసిందో తెలుసా?" మరోసారి కోపంగా భార్య వంక చూశాడు. కూతురు అప్పటికే కాలేజీకి వెళ్ళిపోయింది.

అప్పుడు అర్థమైంది శ్రీలక్ష్మికి.

రెండు రోజుల క్రితం ఓ మురికివాడలో కళాశాల విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని తన కూతురు కవిత డ్యాన్స్ చేసింది.

అదన్నమాట ఆయన ఆగ్రహానికి కారణం.

తనకు ఇష్టంలేని పని చేసినప్పుడు 'నీ ముద్దుల కూతురు' అని, ఇష్టమైన పనులు చేసినప్పుడు 'నా బంగారు కూతురు' అనడం ఆయనకు అలవాటే.

ఇది మామూలు ఇష్టంలేని పని కాదు.

కనకారావు దృష్టిలో ఘోరమైన తప్పు. అందుకే మొహం కందగడ్డలా ఉంది. కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి.

భయంతో శ్రీలక్ష్మి వణికిపోయింది.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ కనకారావు ఫోన్ దాకా వెళ్ళాడు వ్యాపారంలో కూడా అలాగే అంగలు వేస్తూ వచ్చాడు.

అంగలు వేసి వేసి అత్తగారింటి నుంచి శ్రీలక్ష్మిని తెచ్చుకున్నాడు. శ్రీని తెచ్చుకున్నాడు.

మార్కెట్‌లో అంగలు వేసి పెద్ద వ్యాపారి అని పేరు తెచ్చుకున్నాడు.

ఇప్పుడు రమ్మంటే మంత్రులే అతని దగ్గరికి అంగలు వేసుకుంటూ వస్తారు. అతను తలుచుకుంటే ఆఫీసుల్లో ఫైళ్ళు అంగలు వేసుకుంటూ కదిలి పోతాయి.

అలాంటి కనకారావు కూతురు ఓ మురికివాడలో డాన్స్ చేస్తుందా! షేమ్! షేమ్!

అసలు కనకారావు కూతురు డాన్స్ ఎందుకు నేర్చుకుంది?

కనకారావు కున్న ఆస్తుల్ని ఉండబోయే ఆస్తుల్ని కాపాడటానికి నల్లకోట్లు వేసుకొని ఎందరో లాయర్లున్నారు, కాకీ దుస్తులవాళ్ళూ ఉన్నారు అయినా కనకా రావు ఓ బొచ్చుకుక్కను ఎందుకు పెంచుతున్నాడు? ఎందుకు పెంచుతున్నాడు? అదిగో అందుకే-కూతురుకు డాన్స్ కూడా నేర్పించాడు.

శ్రీలక్ష్మి ఏదో చెప్పబోయింది.... కూతురు కాలేజీకి వెళ్ళబోతున్న భర్తను ఆపబోయింది.

కాని .. ఉరిమి చూసేసరికి ఏమీ చెప్పలేక తడికళ్ళతో అతని వంక చూసింది.

వ్యాపార సూత్రాల్ని అర్థం చేసుకున్నంత సులువుగా తడి కళ్ళను అర్థం చేసుకోలేరు కనకారావులు.

నిలువెల్లా ఆగ్రహంతో అంగలు వేసుకుంటూ వెళ్ళి కారులో కూర్చు న్నాడు కనకారావు.

వేగంగా దూసుకుపోతున్నది. కాదు.

భర్త కారును కిటికీ చువ్వల వెనకనుంచి చూస్తూ నుంచుంది శ్రీలక్ష్మి.

ఆ మాట వినగానే ప్రిన్సిపాల్‌గారి గొంతు తడారిపోయింది.

కళ్ళు పటంలోని వేంకటేశ్వరస్వామి పాదాలపై పదే పదే వాలాయి.

"ఏవడా లెక్చరర్? పిలూ ఇటు...." హుంకరించాడు కనకారావు.

మొసలిరంగు తల.... మొసలి రంగు కోటు.... బుసలు కొడుతున్న మొసలిలా ఉన్నాడు కనకారావు.

నారాయణుడు రాడని తెలిసిన గజేంద్రునిలా వణికిపోతున్నారు ప్రిన్సిపాల్.

"పిలూ ఇటు..."

మరోసారి కర్ణకఠోరమైన ఆ హుంకరింపును విని—"సారయ్యా...." సారయ్య అని పిలచారు ప్రిన్సిపాల్.

బజర్ నొక్కక తనను పెద్దసార్ పేరుతో పిలిచినందుకు అటెండర్ సారయ్య ఆశ్చర్యపోయాడు.

"సార్...."

ప్రిన్సిపాల్ ముందు వాలి వినయంగా చేతులు కట్టుకొని నిల్చున్నాడు సారయ్య.

"శ్యాంసుందర్ సార్‌ను పిలువు" అన్నారు ప్రిన్సిపాల్. ఆయన సీట్లో లేరు. సోఫా ప్రక్కనున్న కుర్చీలో ఉన్నారు. తలూపుతూ పరుగున జయటికి వెళ్ళాడు సారయ్య. ఆ గొంతునుబట్టి 'పెద్దసార్ బడే తక్‌లీఫ్‌ల ఉన్నడు' అనుకున్నాడు.

"ఊఁ ... అయితే కాలేజీ ఇట్లా తయారయిందన్నమాట...."

సెగలు, పొగలు కక్కుతున్న కనకారావు మాటలు వినగానే ప్రిన్సిపాల్‌కి ఎదురుగా ఉన్న ఎత్తుఎత్తు రిజల్ట్స్ చార్టులు, అద్దాల అల్మారాల్లోని వెండికప్పులు వెలవెలబోతూ కనిపించాయి.

"అయితే ... కాలేజీ లిస్టా తయారయిందన్న మాట...."

ఆ మాటలు గోల్కొండ కోటలోని ఫిరంగి గుండ్లలా ప్రిన్సిపాల్ గుండెను తాకాయి. వాళ్ళ ఫామిలీ డాక్టర్ ఆయన కళ్ళలో ప్రత్యక్షమయ్యాడు.

"లేదండి.... సోషల్ సర్వీస్ ప్రోగ్రాంలో స్టూడెంట్స్ ఆ మురికివాడకు వెళ్ళారు...."

"నా కూతురు నెందుకు తీసుకెళ్ళారు?"

ఉరిమి చూశాడు కనకారావు. ఆ చూపులే అంత. ప్రిన్సిపాల్ తన షాపులోని ఓ నౌకరులా కనబడుతున్నాడు అతని కళ్ళకు.

"ఏ పార్టీ ?"

"ఎవరిది సార్?" ప్రిన్సిపాల్ వినయమూర్తి వినయంగా అడిగాడు.

"స్టూడెంట్స్‌ను మురికివాడలకు తీసుకెళ్తున్నాడే ఆ లెక్చరర్‌ది?"

"శ్యాంసుందర్‌దా సార్?"

"ఊఁ...."

"ఏ పార్టీ కాదుసార్."

"ఊఁ.... అబద్దం చెప్పకు" గద్దించి అడిగాడు కనకారావు.

"నిజం సార్. అతనిది ఏ పార్టీ కాదు, అసలు కాలేజీలో ఏ పార్టీలు లేవు సార్."

"ఎన్నాళ్ళయింది కాలేజీలో చేరి?"

"ఎవరు శ్యాంసుందరా సార్?"

"ఊఁ...."

క్షణంసేపు ఆలోచించి "మూడేండ్లయింది సార్" అన్నారు ప్రిన్సిపాల్.

"ఎక్కడుంటాడు?"

చెప్పారు ప్రిన్సిపాల్.

"ఏ జిల్లా వాళ్ళది?"

చెప్పారు ప్రిన్సిపాల్.

"వాళ్ళ తండ్రి ఏంచేసేవాడు?"

చెప్పలేదు ప్రిన్సిపాల్.

"పిలిచారా సార్"

శ్యాంసుందర్ ప్రిన్సిపాల్ గదిలో అడుగుపెట్టాడు.

"ఆఁ శ్యాంసుందర్ గారూ.... వీరు మన కవితగారు లేరూ.... కవిత వాళ్ళ ఫాదర్. పేరు వినేవుంటారు. కనకారావుగారి పేరు తెలియనిది ఎవరికి.." తడబడుతూ పరిచయం చేశారు ప్రిన్సిపాల్. అప్పటికే ఆయన కర్చీఫ్ సగం తడిసిపోయింది.

"నమస్కారం" వినయంగా చేతులు జోడించాడు శ్యాంసుందర్.

"ఊఁ " శ్యాంసుందర్ వంక ఎగాదిగా చూశాడు కనకారావు-"నువ్వేనా మా అమ్మాయిని మురికివాడకు తీసుకుపోయింది?"

కనకారావు ప్రశ్నను విని ప్రిన్సిపాల్ వంక చూశాడు శ్యాంసుందర్.

"అదేనండి మొన్న స్టూడెంట్స్‌ని సోషల్‌సర్వీస్ ప్రోగ్రాంలో స్లమ్ ఏరియాకు తీసుకెళ్ళారు కదా!" అన్నాడు ప్రిన్సిపాల్.

"అవును అందులో మీ అమ్మాయి కవిత కూడా పాల్గొంది" అని చెప్పాడు కనకారావుతో శ్యాంసుందర్.

"నీకేమన్నా బుద్ధుందా? నా కూతురును మురికివాడ శుభ్రం చేయడానికి తీసుకెళతావా? పైగా ఆ అలగాజనం ముందు నా కూతురుతో డాన్స్ చేయిస్తావా?" మాటల్తోనే శ్యాంసుందర్ మీద చేయిచేసుకున్నంత పని చేశాడు కనకారావు.

"కవితగారి డాన్స్‌ప్రోగ్రాం పెట్టినట్లు నాకు ముందుగా ఎందుకు చెప్పలేదండి?" అడిగారు ప్రిన్సిపాల్. పాపం! ఆయన పిల్లిరూపం తొడుక్కున్నట్లు వెంటనే అర్థమయింది శ్యాంసుందర్‌కు. నిజానికి ప్రిన్సిపాల్‌గారి అనుమతితోనే కదా ఆ కల్చరల్ ప్రోగ్రాం ఏర్పాటుచేసింది.

"వండర్‌ఫుల్ ... వెరైటీగా ఉంటుంది కానివ్వండి" అని మెచ్చుకున్న ప్రిన్సిపాల్‌గారు ఇప్పుడు గోడదూకేశారు.

నువ్వు కాలేజీలో లెక్చరర్ పని చేస్తున్నది పాఠాలు చెప్పడానికా లేక స్టూడెంట్స్‌చేత అడ్డమైన పనులు చేయించిమాకు తలవంపులు తేవడానికా?"

ఉరిమే కనకారావు కళ్ళవంక శాంతంగా చూస్తూ ఇలా అన్నాడు శ్యామ సుందర్.

ఇందులో ఎవరికీ తలవంపులు తెచ్చే పనులేవీ స్టూడెంట్స్ చేయలేదు. కవిత నా స్టూడెంట్ సాంఘిక సేవా కార్యక్రమాల్లో ఆమెకు అభిరుచి కలిగించడం అధ్యాపకునిగా నా బాధ్యత."

కావాలంటే సాంఘికసేవ చేస్తున్నట్టు ఫోటో దిగుతారే కాని సాంఘిక సేవ చేస్తారా కనకారావులు ... వారి సంతానం?

అందుకే-"ఏవిటా సాంఘిక సేవ? మురికివాడలో నా కూతురుచేత డాన్స్ చేయించడమా?" అన్నాడు కోపంగా.

ఆ మధ్య రవీంద్రభారతిలో కూతురు డాన్స్ప్రోగ్రాంను పత్రికలు శ్లాఘిస్తే ఎంతో పొంగిపోయాడు కనకారావు.

ఇంటికొచ్చిన అతిధులు బొచ్చుకుక్కను మెచ్చుకుంటే కూడా అలాగే పొంగిపోతాడు.

"మురికివాడలో తన కూతురు డాన్సుచేసిందని తెలిసేసరికి మండిపడు తున్నాడు.

"లేబర్క్లాసు ముందు నా కూతురుచేత డాన్స్ చేయిస్తావా?" నిప్పులు దూకుతున్నాయి కనకారావు కళ్ళనుంచి.

"కవిత ఒక స్టూడెంటే కాదు ఒక కళాకారిణి. కళాకారులకు జనమంతా ఒక్కటే" అన్నాడు శ్యాంసుందర్.

"జనమంతా ఒక్కటే ఎట్లా అవుతారు?" గండుపిల్లిలా చూశాడు కనకా రావు-"ఇదేనా నువ్వు పిల్లలకు చెప్పే చదువు? కూలినాలి చేసుకునేవాళ్ళముందు నా కూతురుచేత డాన్సు చేయించి పైగా సమర్థిస్తున్నావా?"

"తెల్లవాళ్ళు నల్లజాతిని హీనంగా చూసినట్లు .. శ్రామికులను, పేదలను అలగాజనమని, అడుగుజాతి అని అసహ్యించుకోవడం సహించరానిది. అలాంటి భేదభావం పోవాలి. సాటి జనంపట్ల సేవాభావం కలిగించాలనే కదా విద్యార్థుల్ని పల్లెలకు, మురికివాడలకు తీసుకెళ్తున్నాం. శ్రమదానంతోపాటు కల్చరల్ప్రోగ్రాంలు ఏర్పాటుచేస్తున్నాం."

"షటప్ ... డోంటాక్ నాన్సెన్స్ " ఆవేశంతో ఊగిపోయాడు కనకా రావు—"యూఆర్ స్పాయిలింగ్ కాలేజ్ అట్మాస్ఫియర్... స్టూడెంట్స్‌ను చెడ గొడ్తున్నావు...." అని కోపంగా ప్రిన్సిపాల్ వంక తిరిగి — "మిస్టర్ మూర్తీ సస్పెండ్ హిం ఇమీడియట్లీ మేనేజిమెంటుతో నేను మాట్లాడతా" అన్నాడు.

అప్పటికే కనకారావు గర్జనలు, ఘీంకారాలు ప్రిన్సిపాల్ గదిని దాటి కాలేజీ గాలిలో కలిశాయి.

ఒక్కొక్కరుగా విద్యార్థులు ప్రిన్సిపాల్ గదిలోకి తోసుకువస్తున్నారు.

కనకారావు రంకెల్ని అరుపుల్ని అప్పటిదాకా శాంతంగా గమనిస్తున్న ఒక విద్యార్థి.... ఇంకా ఆ సమాధిలో ఉండలేక .... "మాస్టార్ని సస్పెండ్ చేస్తారా? చేయండి ఎలా చేస్తారో చూస్తాం" అన్నాడు.

"మా కాలేజీకి వచ్చి మమ్మల్నే ఎవరు అంటున్నావా? అని అందు కున్నాడు మరో విద్యార్థి.

"మీ కాలేజీనా! నే నెవరో తెలుసా? ఈ కాలేజీ ఎవరి చేతిలో ఉందో తెలుసా?"

"తమరి చేతిలోనే కావచ్చు....కాని మా మాస్టారు మీద దౌర్జన్యం చేస్తే మే ఊర్కోం."

"ఊర్కోక ఏం చేస్తారు? ఏం చేస్తారోయ్?"

"ఏం చేస్తామా ..."

"ఆఁ.... ఏం చేస్తారు? కొడ్తారా ... కొట్టండి చూద్దాం అడుగు ముందుకు వేశారో పోలీసుల్ని పిలిపించి మిమ్మల్ని పిట్టల్ని కాల్చినట్లు కాల్పించగల్ను."

పోలీసుల్ని పిలిపించు చూద్దాం." అంటూ ఉద్రేకంతో కొందరు విద్యా ర్థులు ముందుకు వచ్చారు.

ప్రిన్సిపాల్‌గారి ఫామిలీ డాక్టర్‌కి అప్పుడే కబురు అందింది.

ఆ గదిలోకి తోసుకుంటూ ఇంకా విద్యార్థులు వస్తూనే ఉన్నారు.

అక్కడికి చేరిన అధ్యాపకులు నోరు విప్పలేకపోయారు.

పరిస్థితి విషమిస్తున్నదని గ్రహించిన శ్యాంసుందర్ ప్రవాహంలా వస్తున్న విద్యార్థులకు అడ్డంగా నిల్చున్నాడు.

"దయచేసి మీరు ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దు. మీ తరగతులకు వెళ్ళిపోండి. నామీద ఏమాత్రం గౌరవం ఉన్నా .... ఇక్కడ ఒక్క విద్యార్థి కూడా ఉండవద్దు " అన్నాడు.

పొంగివచ్చే అలలకు బలమైన అడ్డుకట్ట వేసినట్లయింది.

"ప్లీజ్ .. ...కదలండి. గో టు యువర్ క్లాసెస్." అర్థింపు, ఆదేశం ఉన్నాయి శాంసుందర్ గొంతులో.

"వెళ్తాం సార్ మీ మాటమీద అలాగే వెళ్తాం కాని పేదల్ని అలగా జనం అని చులకనగా మాట్లాడినందుకు, మీ మీద దౌర్జన్యానికి దిగినందుకు ఆ పెద్దమనిషిని ముందు క్షమాపణ చెప్పమనండి" అన్నాడు ఒక విద్యార్థి

"అవును క్షమాపణ చెప్పాలి" అని పట్టుబట్టారు విద్యార్థులంతా.

"క్షమాపణా.... నేను క్షమాపణ చెప్పడమా!" ఆగ్రహంగా విద్యార్థుల వైపు చూశాడు కనకారావు.

"అవును—చెప్పి తీరాల్సిందే."

"చెప్పి తీరాల్సిందే"

"చెప్పకపోతే ఇక్కణ్ణుంచి కదల్నివ్వం."

"అంటే ఘెరావ్ చేస్తున్నారా?"

"నీ ఇష్టం వచ్చిన పేరు పెట్టుకో."

"క్షమాపణ చెప్పేదాకా కదలనివ్వం." ముక్తకంఠంతో అరిచారు విద్యార్థులు.

ఆగ్రహంతో ఊగిపోతూ ఒక అంగలో ప్రిన్సిపాల్ టేబుల్ మీద ఫోన్ అందుకున్నాడు కనకారావు. పిట్టల్ని కాల్చుమని చెప్పడానికి తుపాకులకు డయల్ చేయబోయాడు. కాని అంతలోనే ... ఓ నాజూకు చేయి···· అతని చేతిలోంచి రిసీవర్‌ను లాక్కొని క్రెడిల్ మీద పెట్టింది.

విద్యార్థుల గుంపులోంచి ముందుకు దూసుకువచ్చిన ఆ నాజూకు చేయి అమ్మాయి కవిత! కనకారావు కూతురు!

"బేబీ!" కోపం, ఆశ్చర్యం మిళితమై ఉన్నాయి కనకారావు గొంతులో.

"మీ దృక్పథం మారాలి డాడీ. మర్యాదగా క్షమాపణ చెప్పండి. లేక పోతే పోలీసుల్ని కాదు.... సైన్యాన్ని పిలిచినా నిన్నిక్కణ్ణుంచి నేను కదల నివ్వను" అన్నది దృఢంగా కవిత.

ఆ మాటలు అగ్నిగోళాల్లా గుండెను తాకాయి. నిర్ఘాంతపోయాడు కనకా రావు.

ఊహించని పరిణామం అంది.

'అడ్డులే ... లేకపోతే పోలీసుల్ని పిలిపిస్తాను. పిట్టను కాల్చినట్లు కాల్పి స్తాను' అన్లేదు.

ఎందుకంటే ఎదురుగా నుంచున్నది తన కూతురు!

ప్రహ్లాద కథలోని హిరణ్యకశిపునిలా ఖంగుతిన్నాడు కనకారావు!

ఆంధ్రప్రభ వీక్లీ 12-7-89